epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

# తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:297

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | tcnewsdaily | 19.05.2026 మంగళవారం, హైదరాబాద్



## చెట్లను కొట్టేయొద్దు

- కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం
- ఈ పనుల కోసం కేబీఆర్ పార్క్ పరిధిలో చెట్లు నరికివేత
- పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లు నరకొద్దు
- సుప్రీంకోర్టులో స్టే ..తదుపరి విచారణ జులై 27కి వాయిదా
- ప్రభుత్వమే చెట్లను తొలగిస్తోంది.. అప్పటికి మీరేం చేయొద్దు

2




## నీట్ పేపర్ లీక్‌పై కీలక నిర్ణయం

- పేపర్ లీక్ కేసును సమీక్షించాలని నిర్ణయం
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో సంస్కరణలు అమలు
- ఎన్టిఎ చైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషి సహా ఇతర ఉన్నతాధికారులకు కమిటీ నోటీసులు
- ఈనెల 21న కమిటీ ముందు విచారణకు రావాలని ఆదేశం
- వచ్చే నెలలో 4 నుంచి ఈ వైద్య ప్రవేశ పరీక్ష

2

# ఆఫ్రికాలో ఎబోలా వైరస్



ప్రపంచ ప్రజారోగ్య ఆందోళనలు

- ఈ వ్యాధి దేశంలోకి రాకుండా భారత్ అప్రమత్తం
- ఎబోలా వైరస్ వ్యాప్తిని నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడి
- ఈ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం..ఆరోగ్య నిపుణులు
- ఎబోలా వైరస్ కారణంగా కాంగో, ఉగాండాలో 90 మంది మృతి
- మరో 300కు పైగా ఎబోలా అనుమానిత కేసులు
- ఎబోలా వైరస్ 21 రోజులపాటు రోగిలో సజీవంగా ఉంటుంది
- భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు

2

ఆఫ్రికాలోని కాంగో, సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి మరోసారి ప్రపంచ ప్రజారోగ్య ఆందోళనలను పెంచింది. ఈ క్రమంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని నిశితంగా గమనిస్తున్నామని భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించకుండా నిఘా పెట్టామని పేర్కొన్నారు. జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) ఈ పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తోందని వెల్లడించారు.

**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**

ప్రాణాంతక ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలో కలకలం రేపుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అప్రమత్తమైంది. ఈ సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకుంది. కాగా, ఎబోలా వైరస్ కారణంగా కాంగో, ఉగాండాలో ఇప్పటివరకు 90 మంది ప్రాణాలు విడిచారు. మరో 300కు పైగా ఎబోలా అనుమానిత కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా అలర్ట్ అయ్యింది. దేశంలో ఏదైనా ఎబోలా అనుమానిత కేసు గుర్తిస్తే వెంటనే సంసిద్ధత, స్క్రీనింగ్ యంత్రాగాలు, ప్రతిస్పందన వ్యూహాన్ని అంచనా వేయడానికి ఒక సమీక్షా సమావేశాన్ని కూడా

..మిగతా 2 లో

# సిరిసిల్లలో తీవ్ర ఉద్రిక్తత

- బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణ
- పోలీసుల లాఠీచార్జ్
- కేటీఆర్, బండి సంజయ్ కు వ్యతిరేకంగా పోటాపోటీ ధర్నాలు, నినాదాలు
- చెప్పులతో దాడి- ముఖ్య నేతల బాహాబాహీ..
- రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ
- ఇరు గ్రూపులను చెదరగొట్టి, భారీగా అరెస్టులు

2




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సోమవారం రాజకీయ రణరంగంగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల వారు పోటాపోటీగా నిరసనలకు దిగడమే కాకుండా, పరస్పరం దాడులు, చెప్పుల విసురుకోవడాల వరకూ వెళ్లారు. దాంతో సిరిసిల్ల పాత బస్టాండ్ పరిసరాలు గందరగోళంగా మారాయి.

*-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో*



## ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ

- విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతానికి కృషి
- ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్' కీలకం
- హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభం
- విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా
- పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


2



## రోడ్లపై నమాజ్‌లు వద్దు

2


- ముస్లింలు జనాభా నియంత్రించుకోవాలి
- ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం
- ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్



## అమెరికా ఆంక్షలు డోంట్ కేర్

- రష్యా నుంచి చమురు కొంటాం
- దేశ అవసరాల ఆధారంగా లాభసాటిగా ఉండాలి
- పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ
- ప్రస్తుతం ముడిచమురు సరఫరాకు ఎలాంటి కొరత లేదు
- ముందే చేసుకున్న ఒప్పందాల వల్ల తగినంత చమురు ఉంది

2



## మావోయిస్టు రహిత దేశమే లక్ష్యం

- మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ లకు సన్మానం
- బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించగలిగాం
- హోం మంత్రి అమిత్ షా

2

## రాష్ట్రంలో రెండు రోజులపాటు వర్షాలు

- ఇంకో వైపు తీవ్ర ఎండలు
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే చాన్స్
- నైరుతి రుతుపవనాల విస్తరణకు అవసరమైన తీరుగా వాతావరణంలో మార్పులు
- హైదరాబాద్ వాతావరణ శాఖ

2



తెలంగాణ చౌరస్తా

జనరల్ న్యూస్ NEWS

19.05.2026
మంగళవారం,
హైదరాబాద్



# చెట్లను కొట్టేయొద్దు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ పరిధిలోని పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లను కొట్టేయవద్దని, 25 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పనుల కోసం కేబీఆర్ పార్క్ పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది వివేక్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రణాళిక ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మించవచ్చా? అని ధర్మాసనం ప్రశ్నించడంతో అలాంటిదేమీ లేదని వివేక్ రెడ్డి కోర్టుకు తెలియజేశారు. వాస్తవానికి ప్రభుత్వమే చెట్లను తొలగిస్తోందని తెలిపారు. రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లు నరుకుతున్నారని వివరించారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లు నరకొద్దని అభివృద్ధి బోర్డు చెప్పిందని అన్నారు.

విచారణ జులై 27కి వాయిదా : వాదనల అనంతరం ప్రతివాదులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులుగా పీసీసీఎఫ్, మరో ఇద్దరు వ్యక్తులను పిటిషనర్ చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం తరపున స్టాండింగ్ కౌన్సిల్‌కు నోటీసు అందించాలని పిటిషనర్ న్యాయవాదిని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఆదేశించింది. కేసు తదుపరి విచారణను జులై 27కి వాయిదా వేసింది.

# నీట్ పేపర్ లీక్‌పై కీలక నిర్ణయం

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

నీట్ యూజీ 2026 పేపర్ లీక్ పై పార్లమెంటరీ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)లో సంస్కరణల అమలుతో పాటు పేపర్ లీక్ కేసును సమీక్షించాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు చర్చల కోసం NTA ఛైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషి సహా ఇతర ఉన్నతాధికారులకు కమిటీ నోటీసులు జారీ చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీక్, కేసు దర్యాప్తు వివరాలు ఇవ్వాలన్న కమిటీ, ఈనెల 21న కమిటీ ముందు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. నీట్ పేపర్ లీక్, NTA సంస్కరణలపై మే 21న విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత అధికారుల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నట్లు రాజ్యసభ ఒక ప్రకటన విడుదల చేసింది.

నీట్ యూజీ పేపర్ లీక్ కేసు దర్యాప్తు పురోగతిపై సమీక్ష NTA సంస్కరణలపై కె. రాధాకృష్ణన్ కమిటీ నివేదిక అమలును సమీక్షించడం, అలాగే నీట్ యూజీ పేపర్ లీక్ కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకోవడం ఈ సమావేశ అజెండాలో ఉన్నాయి. ఇంకా విద్యారంగంపై కృత్రిమ మేధస్సు (AI) ప్రభావం, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే వ్యూహాలపై కూడా ఈ




కమిటీ చర్చించనుంది. ఈ చర్చల కోసం ఆంథ్రోపిక్ ఇండియా, ప్రథమ్, ఐఐటీ కాన్పూర్, ఇన్ఫోసిస్, ఐఐటీ మద్రాస్కు చెందిన ప్రతినిధులు ఉన్నారు. కాగా, ఈ కమిటీకి కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు.

**ఇతర అంశాలపైనా చర్చించనున్న కమిటీ**

ఇదిలా ఉండగా, మరొక ప్రత్యేక సమావేశంలో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (AMU) ఉపకులపతి, మైనారిటీ విద్యా సంస్థల జాతీయ కమిషన్ (NCMEI) ఛైర్‌పర్సన్‌తోనూ కమిటీ చర్చలు జరపనుంది. రిజర్వేషన్ల అమలు, ఖాళీలు, జాతీయ విద్యా విధానం (NEP) వంటి వివిధ అంశాలపై ఈ చర్చలు సాగనున్నాయి. ఈ కమిటీ తన 379వ నివేదికపైనా చర్చించనుంది. ఇందులో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన 365వ నివేదికలోని సిఫార్సుల అమలుకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఉన్నాయి. అంతేకాకుండా, 'జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి' (NCTE) పనితీరు సమీక్ష, NEP 2020 కింద చేపట్టిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలపై రూపొందించిన 368వ నివేదికలోని సిఫార్సుల అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలపై రూపొందించిన 380వ నివేదికను కూడా ఈ కమిటీ పరిశీలించనుంది.

**మరో నిందితుడు అరెస్టు**

మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మరొకరిని అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ (RCC) ఫౌండర్ శివరాజ్ రఘునాథ్‌ను సీబీఐ (CBI) అధికారులు అరెస్టు చేశారు. ప్రశ్నపత్రం లీకేజీ, దానిని ఇతరులకు చేరవేసిన ముఠాలో శివరాజ్ సభ్యుడని దర్యాప్తులో భాగంగా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో జరిపిన సోదాల్లో భాగంగా అతడి ఫోన్‌లో లీక్ అయిన ప్రశ్నపత్రం కనిపించడంతో అతడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపర్చగా 9 రోజుల కస్టడీ విధించింది. నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన ఎగ్జామ్ను NTA రద్దు చేసింది. ఈ క్రమంలోనే నీట్ యూజీ రీ ఎగ్జామ్ను జూన్ 21న నిర్వహిస్తామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే 4 నుంచి ఈ వైద్య ప్రవేశ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతుందని చెప్పారు. దాదాపు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు నమోదు చేసుకున్నారు.



# రోడ్లపై నమాజ్‌లు వద్దు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేనని లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించడాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది

# మావోయిస్టు రహిత దేశమే లక్ష్యం

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

దేశాన్ని పట్టి పీడిస్తున్న నక్సల్స్ తీవ్రవాదానికి ముగింపు పలకడమే తమ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పుర్‌లో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను సోమవారం అమిత్ షా సన్మానించారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన తెలంగాణ పోలీస్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ని సన్మానించారు. రాష్ట్ర భద్రతా సలహాదారు, మాజీ డీజీపీ శివధర్ రెడ్డిని సత్కారించారు. డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్, గ్రేహౌండ్స్) అనిల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. మల్కాజ్‌గిరి కమిషనర్, మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతి, ఆమె బృందాన్ని అమిత్ షా సన్మానించారు. దేశంలో నక్సలిజాన్ని 31 మార్చి 2026 నాటికి పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అమిత్ షా స్పష్టం చేశారు. స్పష్టమైన ప్రణాళిక, వ్యూహంతో ముందుకు సాగడంతో బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించగలిగామని వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో ఇది చరిత్రాత్మక మైలురాయని అభివర్ణించారు. 1970వ దశకం నుంచి మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం ప్రభావాన్ని ఎదుర్కొన్నారని చెప్పుకొచ్చారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు దెబ్బతినడం జరిగిందని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలనలో దేశవ్యాప్తంగా భద్రతా దళాల జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. భద్రతా దళాల సమన్వయం, పట్టుదల వల్లే అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగామని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెండు రోజులపాటు వర్షాలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని పలు జిల్లాల ప్రజలకు వాతావరణ శాఖ అధికారులు కీలక సూచనలు చేశారు. అల్పపీడన ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాగల రోజుల పాటు (ఇవాళ, రేపు, ఎల్లుండి) పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ సైతం తెలిపారు.

**ఈ జిల్లాల్లో రెండు, మూడు రోజులు వర్షా లు**

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రజలకు వర్షాలతో కాస్త ఉపశమనం కలగనుంది. ప్రధానంగా హైదరాబాద్‌తో పాటు నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో ఒకే సమయంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు తలెత్తనున్నాయి. మంగళవారం (మే 19) నుంచి తెలంగాణవ్యాప్తంగా ఎండల తీవ్రత విపరీతంగా పెరగనుందని, వారం రోజులపాటు అదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి.

**ఓవైపు ఎండల తీవ్రత, మరోవైపు వర్షా లు**

ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ఆయా ప్రాంతాలకు కూడా రెడ్ అలర్ట్ వర్తిస్తుందని పేర్కొన్నారు. వీటికి తోడు రేపు కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు (Heatwaves) వీచే అవకాశముందని, ప్రజలు మధ్యాహ్న సమయంలో బయటకు వచ్చేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

**కేరళ నైరుతి రుతుపవనాల రాకపై అప్‌డేట్**

కేరళ ప్రాంతంలో నైరుతి రుతుపవనాల విస్తరణకు అవసరమైన తీరుగా వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. కేరళంలో రుతుపవనాల రాకకు నిర్దేశించిన ఈ ప్రమాణాలు మే 29 తర్వాత మాత్రమే పూర్తి కానున్నాయి. తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా ప్రకారం కేరళలోకి నైరుతి రుతుపవనాలు మే 30కి రెండు రోజుల ముందు లేదా తరువాత ప్రవేశించే అవకాశం ఉంది.



# సిరిసిల్లలో తీవ్ర ఉద్రిక్తత

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సోమవారం రాజకీయ రణరంగంగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల వారు పోటాపోటీగా నిరసనలకు దిగడమే కాకుండా, పరస్పరం దాడులు, చెప్పుల విసురుకోవడాల వరకూ వెళ్లారు. దాంతో సిరిసిల్ల పాత బస్టాండ్ పరిసరాలు గందరగోళంగా మారాయి. పరిస్థితి అదుపు తప్పడంతో జిల్లా ఎస్పీ, డీఎస్పీ రంగంలోకి దిగి+ లాఠీచార్జి చేసి ఇరు గ్రూపులను చెదరగొట్టారు. బాలిక అంశంలో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను తక్షణమే మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలపడానికి పోలీసుల అనుమతి తీసుకున్నారు. అనంతరం పాత బస్టాండ్ ప్రాంతంలోని నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో ధర్నాకు దిగారు. బండి సంజయ్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ఆయన్ను బర్తరఫ్ చేయాలని, బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి □కౌంటర్‌గా.. గతంలో □22 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన కేటీఆర్‌ను శిక్షించాలని, గ్లోబరీనా సంస్థపై 'సిట్' ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు సైతం అదే సమయంలో నేతన్న చౌక్‌కు చేరుకుని ధర్నాకు ఉపక్రమించాయి. ఒకే వేదిక (నేతన్న చౌక్) సమీపంలో ఇరుపార్టీల శ్రేణులు భారీగా మోహరించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ శ్రేణులు 'బండి సంజయ్ డౌన్ డౌన్' అంటూ, బీజేపీ శ్రేణులు 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎదురెదురుగా నిలబడి గొంతు చించుకున్నారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి, పరస్పర దాడులకు దారితీసింది. నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగి ముష్టియుద్ధం చేసుకున్నారు. ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో నేతన్న చౌక్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి.

**రంగంలోకి పోలీస్ బాస్.. లాఠీచార్జి, అరెస్టులు**

జిల్లా ఎస్పీ మహేష్ బిగితే, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అదనపు బలగాలతో రంగప్రవేశం చేశారు. ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల వారిని వారించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. మొదట బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు కలెక్టరేట్ సమీపంలో బండి సంజయ్ భారీ ఫ్లెక్సీతో మరోసారి ధర్నాకు దిగారు. అక్కడ కూడా ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన బీఆర్ఎస్ నాయకుల్లో నాఫ్స్‌క్యాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులు అరెస్టయ్యారు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీసులు భారీగా మోహరించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఆఫ్రికాలో ఎబోలా వైరస్

▶▶ మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసింది.

ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ, అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ తెలిపారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందన్నారు. "గతంతో పోలిస్తే దేశంలో పటిష్ఠమైన విమానాశ్రయ స్క్రీనింగ్ వ్యవస్థలు, వ్యాధి నిఘా యంత్రాంగాలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రపంచంలో ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలితే అవి దేశంలోని వచ్చే ప్రమాదం ఉంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ లాగా ఎబోలా గాలి ద్వారా వ్యాపించదు. ఈ వైరస్ ప్రధానంగా వ్యాధి సోకిన వారి శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం, అసురక్షిత ఖనన పద్ధతుల ద్వారా వ్యాపిస్తుంది. సరైన రక్షణ చర్యలు పాటించకపోతే ఆరోగ్య కార్యకర్తలు, ఫ్యామిలీ కేర్‌గివర్స్ (కుటుంబ సంరక్షకులు) కు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది." అని డాక్టర్ సంజయ్ రాయ్ వెల్లడించారు. కొవిడ్19 మహమ్మారి తర్వాత భారతదేశ ఆరోగ్య సన్నద్ధత గణనీయంగా మెరుగుపడిందని మేదాంత ఆస్పత్రిలోని ఇంటర్నల్ మెడిసిన్, రెస్పిరేటరీ విభాగాధిపతి డాక్టర్ రణదీప్ గులేరియా అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పుడు బలమైన ప్రయోగశాలల నెట్‌వర్క్‌లు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ అకారణ జ్వరం, రక్తస్రావ లక్షణాలతో వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులకు చికిత్స అందించేటప్పుడు ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎబోలా వ్యాప్తి గురించి భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. "సాధారణ స్పర్శ, బహిరంగ ప్రదేశాల్లో తిరగడం, ప్రయాణించడం వల్ల ఎబోలా వైరస్ వ్యాపించదని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు చేయాలి. అనుమానిత రోగులను వేగంగా వేరుచేయాలి. ఆరోగ్య కార్యకర్తలు వ్యక్తిగత రక్షణ పరికరాలను ఉపయోగించాలి. అలాగే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి." అని డాక్టర్ రణదీప్ గులేరియా పేర్కొన్నారు. ఎబోలా వైరస్ గబ్బిలాల నుంచి మనషులకు సోకుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తి శారీరక ద్రవాలు, రక్తాన్ని తాకినప్పుడు ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ ప్రాణాంతకమైన ఎబోలా వైరస్ 21 రోజులపాటు రోగిలో సజీవంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జ్వరం, అలసట, నీరసం, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, దద్దుర్లు, ఇంకా మూత్రపిండాలు, కాలేయ పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ సోకిన వారిలో కనిపిస్తాయి.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని.. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం, ఆస్తి నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంటను ''గోల్డెన్ అవర్''గా పరిగణించాలని తెలిపారు. ఆ సమయంలో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అత్యాధునిక పరికరాలను వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ఘటనా స్థలానికి చేరుకుని వైద్య, రక్షణ సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుండగా, పట్టణాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు ఆందోళన




కలిగిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి సహాయక చర్యలను పరిశీలించారు. రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారం మాత్రమే చేరాలని, పుకార్లను నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్‌మాన్, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, ఎన్డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, పోలీస్, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ శాఖల అధికారులు పాల్గొన్నారు


# అమెరికా ఆంక్షలు డోంట్ కేర్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

అమెరికా ఆంక్షల మినహాయింపులతో సంబంధం లేకుండా రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ సోమవారం తెలిపారు. తక్కువ ధరకు లభించడం సహా, దేశం అవసరాల ఆధారంగా ముమ్ముందు కూడా దీనిని కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. భారతదేశం చమురు కొనే నిర్ణయాలు ప్రధానంగా వ్యాపార లాభాలు, చమురు ఎంత వరకు అందుబాటులో ఉంది అనే అంశాలపై ఆధారపడి ఉంటుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. "మేము చమురు కొనడానికి ముఖ్యంగా వ్యాపార లాభం ఉండాలి" అని ఆమె తేల్చిచెప్పారు. ప్రస్తుతం ముడిచమురు సరఫరాకు ఎలాంటి కొరత లేదని, ముందే చేసుకున్న ఒప్పందాల వల్ల తగినంత చమురు అందుబాటులో ఉందని సుజాత శర్మ తెలిపారు. సముద్రమార్గం ద్వారా వచ్చే రష్యా ముడి చమురు అమ్మడానికి, డెలివరీ చేయడానికి అమెరికా ఇచ్చిన తాత్కాలిక ఆంక్షల మినహాయింపు గడువు మే 16తో ముగిసింది. ఈ గడువు పొడిగించడంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా అమెరికా దీనిని ముగించడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

ఇరాన్ పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో మార్కెట్ ఒత్తిడిని తగ్గించడానికి అమెరికా ట్రెజరీ శాఖ మొదట మార్చి నెలలో రష్యా ఆయిల్ కొనుగోలు చేసే విషయంలో ఆంక్షలు తొలగించింది. తర్వాత ఏప్రిల్ దీనిని మళ్లీ పొడిగించింది. తాజాగా ఆ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో సుజాత శర్మ మాట్లాడుతూ, "అమెరికా ఆంక్షల మినహాయింపు ఉన్నా, లేకున్నా, అది చమురు లభ్యతపై ప్రభావం చూపదు" అని స్పష్టం చేశారు.

ఉక్రెయిన్ పై రష్యా దాడి చేయడంతో పాశ్చాత్య దేశాలు రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించాయి. దీని వల్ల రష్యా మార్కెట్లకు ఇబ్బంది ఏర్పడింది. ఈ నేపథ్యంలో 2022 నుంచి భారత్ కు రష్యా తక్కువ ధరకే ముడిచమురు విక్రయిస్తోంది. అది మన దేశ ముడిచమురు దిగుమతుల్లో ముఖ్యభాగమైంది. ఈ విధంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగదేశమైన భారత్, తక్కువ ధరకు లభిస్తున్న రష్యా ఆయిల్ను కొనుగోలు చేయడం పెంచింది. ఇది దేశీయ కంపెనీలు అంతర్జాతీయంగా ఆయిల్ ఖర్చులను తట్టుకోవడానికి సహాయపడింది. వాస్తవానికి, రష్యాపై అమెరికా, యూరోపియన్ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ, దాని ముడిచమురుపై మాత్రం నేరుగా ఆంక్షలు మోపలేదు. అయితే ఇటీవలి నెలల్లో రష్యాలోని పెద్ద చమురు కంపెనీలైన రోస్నెఫ్ట్, లుకోయిల్ వంటి వాటిపై అమెరికా ఆంక్షలు విధించింది. వీటితోపాటు కొన్ని నౌకలు, బ్యాంకింగ్ మార్గాలపై కూడా ఆంక్షలు మోపింది. అయినప్పటికీ, రష్యా చమురు ఆంక్షల జాబితాలో లేదు. దీనితో ఆంక్షలు లేని నౌకలను వాడుతూ, నిబంధనలకు లోబడిన బ్యాంకులు, బీమా మార్గాల ద్వారా రష్యా, భారతదేశానికి ముడిచమురును సరఫరా చేస్తోంది. కెప్లర్ డేటా ప్రకారం, మే నెలలో భారతదేశానికి రష్యా చమురు దిగుమతులు రోజుకు సగటున 1.9 మిలియన్ బ్యారెళ్లకు చేరవచ్చని అంచనా. ఇది ఒక రికార్డు. ఇక బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు, యుద్ధానికి ముందు కంటే 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, రష్యా చౌకగా చేస్తున్న చమురు సరఫరా వల్ల భారత్కు ఎంతో మేలు చేకూరుతోంది. అందుకే సమీప భవిష్యత్తులో భారత్ రష్యా నుంచి చమురు కొనడం ఆపే అవకాశం లేదని విశ్లేషకులు చెబుతున్నారు



# బీఈమ్యాక్ సొసైటీ ప్రజలకు ఇంప్రూవ్మెంట్ చార్జీలు తగ్గించండి

- జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**



తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో గల బిహెచ్ఇఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో బిహెచ్ఎల్ పరిశ్రమలో విధులు నిర్వర్తించి..రిటైర్మెంట్ అయిన అనంతరం బిఈ మ్యాక్ సొసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా..మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 64 లక్షల రూపాయలు ఇంప్రూవ్మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ఇప్పటికే మూడు కోట్ల రూపాయలను డిడి రూపంలో జలమండలికి చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని..ఇంప్రూవ్మెంట్ చార్జీలు చెల్లించే ఆర్థిక పరిస్థితులు వారికి లేవని ఆయన తెలిపారు. మానవత దృక్పథంతో ఇంప్రూవ్మెంట్ చార్జీలను రద్దుచేసి నల్ల కనెక్షన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఉమేష్, బీఈమ్యాక్ అధ్యక్షులు సంజీవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.



# సేవాపథంలో కౌన్సిలర్ దంపతుల పెళ్లిరోజు వేడుకలు

- వృద్ధాశ్రమంలో అన్నదాన వస్తువుల పంపిణీ

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**



సమాజ సేవలోనే పరమార్థం ఉందంటూ అశ్వారావుపేట 14వ వార్డు కౌన్సిలర్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని వినూత్నంగా, ఆదర్శవంతంగా జరుపుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని డాక్టర్ భూక్య ప్రసాద్ రావు, వారి సతీమణి భూక్య ఉదయ జ్యోతి దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకుని స్థానిక "అమ్మ సేవాసదనం" వృద్ధాశ్రమంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో కౌన్సిలర్ దంపతులు ఎంతో సంతోషంగా కేక్ కట్ చేసి తమ వివాహ బంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నివాసుల నిత్యావసరాల నిమిత్తం బియ్యం బ్యాగులు, బట్టలు, పండ్లతో పాటు ఆశ్రమానికి ఎంతగానో ఉపయోగపడే ఒక బీరువాను కూడా అందజేశారు.ఈ సేవా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసాని పద్మ, కాసాని చంద్ర మోహన్ రావు దంపతులు, అలాగే బిఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ సుంకవరపు సంపూర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదవులు ఉన్నా లేకపోయినా నిత్యం ప్రజల్లో ఉంటూ, తమ పెళ్లిరోజు వంటి ప్రత్యేకమైన రోజున కూడా ఇలా వృద్ధుల చెంతకు వచ్చి సాయం చేయడం ఎంతో అభినందనీయమని కౌన్సిలర్ దంపతులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రముఖులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
తమకు నిత్యావసరాలైన బియ్యం బ్యాగులు, కొత్త బట్టలు, బీరువా అందజేసి ఆత్మీయతను పంచిన భూక్య ప్రసాద్ రావు ఉదయ జ్యోతి దంపతులకు ఆశ్రమంలోని వృద్ధులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆదర్శ జంట నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో సమాజానికి ఇలాగే మరిన్ని సేవలు అందించాలని వృద్ధులు దీవించారు. దీంతో ఆశ్రమ వాతావరణం అంతా పెళ్లిరోజు వేడుకల కోలాహలంతో, ఆనందంతో నిండిపోయింది.



# ప్రజాసమస్యలపై కమిషనర్‌ను కలిసిన వజ్రేష్ యాదవ్

- బోడుప్పల్- చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధి అంశాలపై వినతిపత్రం అందజేత..
- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కమిషనర్

**బోడుప్పల్ తెలంగాణ చౌరస్తా**

సోమవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంత సమస్యలపై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మేడ్చల్ జిల్లా బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కలిశారు.ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చెంగిచెర్ల,బోడుప్పల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

- ఎమ్మెల్యే కృష్ణారావు.

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ మహిళా నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ప్రజలకు చెప్పుకోదగ్గ ప్రయోజనం కలిగించే ఒక్క కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం ఇస్తామని, ప్రతి మహిళకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా వెనుకబడిందని ఆరోపించారు. అలాగే బతుకమ్మ చీరలు కూడా ఎన్నికలు ఉన్న ప్రాంతాల్లో తప్ప రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.2000కు పెంచడం వంటి సంక్షేమ నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కూడా పెద్ద ఎత్తున జరిగిందని, ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఇళ్లను కూడా ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. రాష్ట్రంలో పరిశుభ్రత పరిస్థితులు దిగజారిపోయాయని, ఎక్కడ చూసినా వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల బెడద పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. దోమల నివారణ మందుల పిచికారీ కూడా సక్రమంగా నిర్వహించడం లేదని, పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 25న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సారథ్యంలో జరగనున్న కూకట్ పల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. తిరిగి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



# కాలనీలలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

న్యూ బాలాజీ నగర్ కాలనీ వెనుక భాగంలో నూతనంగా డ్రైనేజీ పైప్లైన్ పనులు చేపట్టారు. అయితే మధ్యలో కొంత భాగాన్ని అధికారులు నూతనంగా చేపడుతున్న పైప్లైన్ లో కలపకపోవడం తో ఫిల్టర్ బెడ్ నుంచి వెళ్లాల్సిన డ్రైనేజీ నీరు తిరిగి వెనక్కు వచ్చి కాలనీ డ్రైనేజీ లైన్ లో కలసి పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా వర్షపు నీరు సైతం వెనక్కు వచ్చి కాలనీలోకి రావడం వల్ల సమస్య తీవ్రంగా మారింది. దీంతో కాలనీవాసులు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని న్యూ బాలాజీ నగర్ కాలనీలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనుల్లో ఎటువంటి సమస్యలు ప్రజలు ఎదుర్కోకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీనాథ్, ఏఈ సునీత తో పాటు స్థానిక నాయకులు బాబురావు, వెంకటేష్, సుభాష్ గౌడ్, రవీందర్ రెడ్డి, రమణ, జస్వంత్, కొండల్ రెడ్డి, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్‌పూర్ టు రుద్రంపూర్

- ఉత్సాహంగా సాగిన '2కే రన్'.. ప్రారంభించిన ఎంపీడీవో సుభాషిని
- ఫిట్ & యాక్టివ్ తెలంగాణ' లక్ష్యంగా అట్టహాసంగా యువజన వారోత్సవాలు ప్రారంభం!

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా జిల్లాలో యువజనోత్సవ వారోత్సవాలు (యూత్ వీక్) మే 18 నుండి 23 వరకు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా, 'ఫిట్ & యాక్టివ్ తెలంగాణ' అనే నినాదంతో గౌతమ్‌పూర్ నుండి రుద్రంపూర్ సింగరేణి ప్రగతి వనం వరకు నిర్వహించిన '2కే మారథాన్ రన్' క్రీడాకారులు, యువతతో కళకళలాడింది.గౌతమ్‌పూర్ కాలనీ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిని, టూ టౌన్ ఎస్ఐ కిషోర్, ఎంపీవో సంధ్యలు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సుభాషిని, ఎస్ఐ కిషోర్ మాట్లాడుతూ.. శారీరక శ్రమ, క్రీడల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. చిన్న పిల్లల నుంచి అన్ని వయసుల వారు ఫిట్‌నెస్‌పై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, స్థానిక క్రీడాకారులు, యువత భారీగా పాల్గొన్నారు. గౌతమ్‌పూర్ ఉపసర్పంచ్ గంగారం, రుద్రంపూర్ ఉపసర్పంచ్ తోటరాజు, వీఓఏలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, స్కూల్ టీచర్లు, పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కూకట్ పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టండి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

మేడ్చల్ జిల్లా అభివృద్ధి అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్‌తో పాటు మేడ్చల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుక్కట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ప్రధానంగా కేపీహెచ్‌బీలోని ఎన్టీఆర్ స్కూల్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు నివేదించినప్పటికీ పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. సంబంధిత స్థలాన్ని జీహెచ్ఎంసీకి కేటాయించి స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అవసరమైతే సొంత నిధులతోనైనా నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు ముందుకు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.
ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృత తండాలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అలాగే కేపీహెచ్‌బీ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ స్థలాల్లో హౌసింగ్ బోర్డు అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వ భూములు ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రశాంత్‌నగర్‌లో ప్రతిపాదిత హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఇప్పటికే స్థలం కేటాయించామని, పనులు ప్రారంభించాలంటూ అధికారులకు పలుమార్లు సూచించినప్పటికీ పురోగతి కనిపించడం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కేపీహెచ్‌బీలో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పూర్తి చేసి గుత్తేదారుని నియమించామని, పనులు త్వరగా పూర్తైతే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మైనింగ్ ఫండ్ నియోజకవర్గానికి వచ్చేలా చూడాలని కూడా ప్రభుత్వ అధికారులను అభ్యర్థించారు. బబ్బుగూడలోని పశువుల సంత స్థలాన్ని సమీప పాఠశాల విస్తరణకు వినియోగించి విద్యాసంస్థను అభివృద్ధి పరచాలని సూచించిన ఎమ్మెల్యే, కైత్లాపూర్‌లో ఇప్పటికే కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో కొత్త పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా అల్లాపూర్ సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, అక్కడ ప్రహరీ గోడ నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను కోరారు.







# పర్యాటక కేంద్రంగా ముత్తంగి ఎంకచెరువు

- రూ.ఏడు కోట్ల 60 లక్షలతో చెరువు సుందరీకరణ
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును 7 కోట్ల 60 లక్షల రూపాయలతో సుందరీకరణ చేస్తున్నామని..అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఎండిఏ అధికారులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. స్వయంగా చెరువు కట్టపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గల ఎంక చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో హెచ్ఎండిఏ ద్వారా 7 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కట్ట అభివృద్ధితో పాటు బతుకమ్మ ఘాట్, లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైటింగ్, గార్డెనింగ్, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మరో రెండు నెలల్ల పనులు పూర్తిచేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ ప్రజలు సైతం చెరువు కట్ట పైకి సులభంగా చేరుకునేందుకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ముత్తంగితో పాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన చెరువు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పటాన్చెరులోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను సైతం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డిఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి, తదితరులు పాల్గొన్నారు.





## మత సామరస్యంతోనే పండుగలకు అసలైన శోభ

- **కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

ప్రజలంతా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో పండుగలను ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పిలుపునిచ్చారు. రాబోయే పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ & ఎం ఫంక్షన్ హాల్‌లో పట్టణ మత పెద్దలతో ప్రత్యేక పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పండుగ ఏదైనా మతసామరస్యం అనేది మానవ సంబంధాలను మరింత పెంపొందిస్తుందని అన్నారు. ప్రజలంతా పండుగలను సామరస్యపూర్వక వాతావరణంలో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా కృషి చేయాలని సూచించారు. రాబోయే బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

పట్టణంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారని డీఎస్పీ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించాలని చూస్తే లేదా శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టాలని ప్రయత్నిస్తే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో కొత్తగూడెం పట్టణానికి చెందిన అన్ని మతాల పెద్దలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని, పండుగను ప్రశాంతంగా ముగించుకుంటామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, త్రీ టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డితో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ సాయి నగర్ కాలనీలో ఘనంగా "హిందూ సమ్మేళనం"

- **హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగం కావాలి**
- **బోడుప్పల్ ఈస్ట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్**

**బోడుప్పల్ తెలంగాణ చౌరస్తా:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ శ్రీ సాయి నగర్ కాలనీ, ఆర్ ఎన్ఎస్ ఫేస్ 1,2,3, అన్నపూర్ణ కాలనీ, పద్మావతి కాలనీ, సిసిఎన్బి కాలనీ, కమలానగర్ మొదలైన 12 కాలనీల అందుబాటులో శ్రీ సాయి నగర్ కాలనీ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో "హిందూ సమ్మేళనం" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యం క్రమంలో పలువురు వక్తలు, రాజకీయ ప్రముఖులు పాల్గొని హిందూ మతం యొక్క గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని గురించి వివరించారు. నేడు ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలు హిందూ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పోటిస్తూ హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని చేస్తున్నారు. కానీ భారతదేశంలో మాత్రం అందుకు భిన్నంగా హిందువులపై దాడులు చేయడం, హిందూ మతాన్ని కించపరచడం, హిందూ ఆలయాల పైన దాడులు చేయడం, విగ్రహాలు ధ్వంసం చేయడం హిందూ దేవుళ్ళపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో హిందువులంతా ఏకమై ఐక్యమత్యంగా ఉంటూ హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుంటూ, హిందూ వ్యతిరేక శక్తులను ఎదుర్కోవాలని అందుకు ప్రతి ఒక్క హిందూ సంసిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హిందూ ధర్మం గురించి వక్త కుమారస్వామి సందేశం విశేషంగా ఆకట్టుకుంది. కొన్ని వందల సంవత్సరాల నాటి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు వివరించారు. అలాగే కళాకారులు, చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు, ఆలోచించిన శ్లోకాల, భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ ఈస్ట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్, పలువురు బిజెపి నాయకులు, కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







## గ్రామీణ వైద్యులపై అధికారుల కొరడా

- **భద్రాద్రి జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీల తీవ్ర ఆందోళన**
- **ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం**
- **అండగా ఉంటామని తెలంగాణ ఆర్ఎంపీ సంఘంలకు ఎమ్మెల్యే ప్రకటన**

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ఇటీవల గ్రామీణ వైద్యులపై నిఘా నీడ ముసురుకుంది. పల్లె ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ దశాబ్దాలుగా ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను ప్రభుత్వ తనిఖీలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) అధికారులతో పాటు ప్రభుత్వ వైద్యాధికారులు నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలు (రైడింగ్స్), విధిస్తున్న భారీ జరిమానాలతో పల్లె వైద్యులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో ఇటీవల అధికారులు జరిపిన దాడులు, విధించిన ఫైన్ల మోత స్థానిక వైద్యుల్లో తీవ్ర కలవరాన్ని రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో అధికారుల చర్యలతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న వైద్య సోదరులకు అండగా నిలిచేందుకు తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ, సీపీ, ఈపీ సంఘం రంగంలోకి దిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లోని స్థానిక ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు ఇవ్వాలని సంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం అశ్వారావుపేట మండల, జిల్లా కమిటీలు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నాయి. అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్ వద్ద జరిగిన 10కే రన్ ప్రోగ్రాంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అధికారుల తనిఖీల వల్ల వైద్యులు ఎదుర్కొంటున్న మానసిక, ఆర్థిక ఇబ్బందులను ఎమ్మెల్యేకు కూలంకషంగా వివరించి మెమొరాండం సమర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ శశికళ, వైస్ చైర్పర్సన్ జూపల్లి రమేష్‌లను కూడా కలిసి వినతిపత్రాలు అందజేశారు.


అత్యవసర సమయాల్లో, అర్ధరాత్రి వేళల్లో సైతం ప్రాణాలను లెక్కచేయకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న తమపై కక్షసాధింపు చర్యలు ఆపాలని ఈ సందర్భంగా వైద్య సంఘం నాయకులు కోరారు. తనిఖీల పేరిట వేధించడం సరికాదని, తాము కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమై సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. తమ ఉపాధిని దెబ్బ తీయకుండా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యవరపు జగదీష్, జిల్లా ప్రెసిడెంట్ పి. వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రెటరీ టి. రామదాసు, జిల్లా ట్రెజరర్ టి. కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ప్రేమ్ సాగర్, రఫీ, పుల్లారావు, భగవాన్, అశ్వారావుపేట మండల కమిటీ ప్రతినిధులు మరియు స్థానిక గ్రామీణ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలిసి విస్తృత తనిఖీలు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని0 బస్టాండ్, ఐటీఐ కళాశాల పరిసర ప్రాంతాల్లో పెద్దపల్లి పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా అనుమానాస్పద కార్యకలాపాల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా ప్రయాణికుల సామాన్లు, అనుమానిత ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజల భద్రతే లక్ష్యంగా కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నేరాల నియంత్రణతో పాటు గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..






## న్యాయమైన వీఆర్ఏల డిమాండ్‌లను నెరవేర్చాలి

- **జీఓ నెం.81&85 ప్రకారం వారి వారసులకు ఉద్యోగాలు**
- **మండల వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కి వినతి పత్రం అందజేత.**

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల తాసిల్దార్ కార్యాలయంలో మండల వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ రాపెల్లి రాముడుకి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి,జీఓ నెం.81&85 ప్రకారం వారి వారసులకు ఉద్యోగాలు జీవో ప్రకారం పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.వీఆర్ఏలు ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ,ఇప్పటికీ పలు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.జీఓ నెం.81&85 జీవో ప్రకారం వారసత్వ ఉద్యోగాలు,పదోన్నతులు,ఉద్యోగ భద్రత,పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ సతీష్,ప్రశాంత్,కుమార్,ప్రశాంత్ ,షబ్బీర్, బాబర్, మోహన్, దేవేందర్, విష్ణు, రాయగట్టు, చంద్రమౌళి దీపిక, తదితరులు పాల్గొన్నారు



## అనుమతులు లేకుండా బన్సాల్ అడ్మిషన్ల దందా

- **తోకల పేరుతో హంగామా**
- **కళాశాల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**
- **గతంలో ఫిర్యాదూ చేసిన చర్యలు తీసుకోవటంలో డిఐఈవో విఫలం**
- **ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్**




**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

కరీంనగర్ జిల్లాలో బన్సల్ కళాశాల యజమాన్యం తను ఆడిందే ఆటగా తప్పుడు ఫలితాల చూపెట్టి తదనంతరం బాన్సల్ కళాశాల యజమాన్యం జిల్లాలో బోర్డు తిప్పేయడంతో మళ్ళీ తోక పేర్లతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేయాటానికి లేపిందన్నారు.గతంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బన్సల్ కళాశాల యజమాన్యంపై పలుమార్లు జిల్లా కలెక్టర్,ఇతరత్రా విద్యా అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తద్వారా బన్సల్ కళాశాల యజమాన్యం వాళ్లు ఆడిందే ఆటగా ఇంటర్మీడియట్ ఫలితాలు అనంతరం బోర్డు తిప్పేసి విద్యార్థుల వారి తల్లిదండ్రులకు మొండిచేయి చూపిందన్నారు.విద్యార్థుల జీవితం రోడ్డు పాలు కావటానికి కారణం విద్యాశాఖ అధికారులే కారణమని ఆసహనం వ్యక్తం చేశారు.ఇకనైనా డీఐఈఓ క్షేత్రస్థాయిలో జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలపై ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేయాలన్నారు ఫలితాల అనంతరం బోర్డు తిప్పేసి విద్యార్థుల జీవితాలను రోడ్డుపై వేసి మళ్ళీ తోక పేర్లతో ముందుకు వస్తున్న బన్సల్ కళాశాల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని యుగంధర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చంచల మురళి పినమల్ల భాస్కర్ వినయ్ రాజు తదితరులు పాల్గొన్నారు.




## డిజిటల్ పద్ధతిలో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

- **బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టంచేస్తాం.**
- **నియోజకవర్గ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు**
- **కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి కేసీఆర్ ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం..**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో తెలంగాణ చేరస్తా:**

భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నట్లు కొత్తగూడెం నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం కొత్తగూడెంలోని వనమా నివాసంలో నియోజకవర్గ సమన్వయ కమిటీల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో రాబోయే సభ్యత్వ నమోదు ప్రక్రియ, కమిటీల నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు.

**ప్రతి ఇంటికి బూత్ ఏజెంట్లు ఈసారి పూర్తిగా డిజిటల్ సభ్యత్వం**

సమావేశంలో వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ ఇంచార్జ్ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు నేతృత్వంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తామన్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలో బూత్, వార్డు, గ్రామ స్థాయిల్లో పార్టీని పటిష్టం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. త్వరలోనే ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కోసం.. ప్రతి 10 బూత్‌లకు ఐదుగురు ఇన్చార్జిలను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇన్చార్జిలు ఒక్కో బూత్‌లో ఇద్దరు ఏజెంట్లు ఉండేలా చూస్తారని, ఈ బూత్ ఏజెంట్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు బిఆర్ఎస్ సభ్యత్వం అందిస్తారని వివరించారు. ఇందులో సాధారణ, క్రియాశీల సభ్యత్వాలు ఉంటాయని.. ఈసారి ఈ ప్రక్రియ అంతా సరికొత్తగా "డిజిటల్ పద్ధతిలో" నిర్వహించనున్నట్లు వనమా ప్రకటించారు. సభ్యత్వ నమోదుపై బూత్ ఏజెంట్లకు త్వరలోనే ప్రత్యేక శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**కష్టపడిన వారికే పదవులు –**

రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమ సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగిసిన వెంటనే పార్టీ నూతన కమిటీల నిర్మాణం జరుగుతుందని వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, నిరంతరం శ్రమించే నిజమైన కార్యకర్తలకు నూతన కమిటీల్లో తగిన గుర్తింపు, సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యకర్తలంతా సైనికుల్లా కష్టపడి పని చేయాలని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడం ఒక్క కేసీఆర్ తోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ నాయకత్వానికి పట్టం కట్టడం ఖాయమని, రాబోయేది మన ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





**భారీగా తరలివచ్చిన ముఖ్య నాయకులు**

ఈ సన్నాహక సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, పాల్వంచ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, సీనియర్ నాయకులు మల్లెల రవిచంద్ర, కార్పొరేటర్లు బత్తుల మధుచంద్ (38వ డివిజన్), గుగులోత్ రాంబాబు (32వ డివిజన్), సింధు తపస్వి (7వ డివిజన్) పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు ముత్యాల ప్రవీణ్, పాల్వంచ పట్టణ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల, దాసరి నాగేశ్వరరావు, సత్యనారాయణ (సంపు), శేఖర్, చందు నాయక్, బాకూరు లక్ష్మీ నాయుడు, మిరియాల అలివేలు, జోహార్, నారికట్ల శేఖర్, ఆదినారాయణ, దాసరి సురేష్, పాపగంటి సునీల్, నరేందర్, శ్యాంసుందర్ రెడ్డి, ఏనుగుల శీను, పూల రవీందర్, రాందాస్, మోతి, శివ, శ్రీకాంత్, ఓం ప్రకాష్, వాసుమల్ల గౌతంలతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.